# మూడు దృశ్యాలు

— ఎమ్. దేవనాగ మోహనరావు

ఆ వేళ ప్రొద్దుటే జనరల్ మేనేజరుగారు తన స్వంత అంబాసిడర్ కారులో వస్తూ 'ఫరమ్' ఆవరణలో మూడు విచిత్రమయిన దృశ్యాలు చూశారు. ఆయనకు ఏమీ అర్థం కాలేదు. మతి పోయినంత పనయ్యింది. తన ఆరోగ్యం సరిగా ఉన్నదా అని ఆయనకు కొంచెం సందేహం కలిగింది. అందువలన ఆయన చాలా కంగారు పడ్డారు.

○ ○ ○

అది ఓ పేరున్న ఫర్మ్. అందులో లేదంటే ఓ వంద ఉద్యోగాలకు ఖాళీలువచ్చాయి. ఆ ఖాళీలు నింపడంకోసం సరియైన అభ్యర్థుల్ని ఎంపికచేసే బాధ్యత మన జనరల్ మేనేజరు గారిపై పడింది. ఆయన చాలా నిజాయితీ కల వారని, ధర్మాత్ముడని, కష్టసుఖాలు తెలిసున్న మనిషని, అభ్యర్థి స్థితిగతులను పరిశీలించి అవసరం ఉన్నవారికే ఉద్యోగాలు ఇస్తారని మిక్కిలి ప్రసిద్ధికెక్కారు.

○ ○ ○

ఆ మూడు దృశ్యాలు పాపం ఆయన్ను చాలా కలవరపరిచాయి. అందుమూలంగా ఆయనకు కొంచెం జ్వరంకూడా వచ్చింది. ఆలోచిస్తున్నకొద్దీ అదేదో బ్రహ్మరహస్యంలా అనిపించసాగింది.

ఆ మూడు దృశ్యాలు ఇంకా ఆయనకళ్లకు కట్టినట్లే ఉన్నాయి.

కారులో 'ఫరమ్' ఆవరణలోనికి ప్రవేశిస్తుండగా ఆయనకు గేటుదగ్గర ఒకడు కనిపించాడు. వాడు ఎదురుగా గుడ్డలమూటలు పట్టుకొనిచున్నాడు. అందరికీ చిరిగిన చొక్కాలు, ప్యాంట్లూ విప్పి చూపిస్తున్నాడు!

లోపలికి వస్తుండగా గోడచాటున చక్కని బట్టలు వేసుకున్న ఓ యువకుడు 'ప్రరున' తన చొక్కా చింపేసుకుంటున్నాడు!

తన ప్రయివేటు రూమ్వైపుకు వెళ్తుండగా జనరల్ మేనేజరుగారు చూసిన మూడవ దృశ్యం: తెల్లటి బట్టలు వేసుకున్న ఇంకో యువకుడు అటూయిటూ చూసి, ఎవరూ లేరని నిర్ధారించుకొని హఠాత్తుగా, పిచ్చిపట్టిన వాడిలా క్రిందపడి మట్టిలో దొర్లడం!

ఫరమ్ ఆవరణంతా ఇంటర్వ్యూకి వచ్చిన వాళ్ళతో నిండి ఉంది. ఆయనకు అంతా విడ్డూరంగా కనిపించసాగింది. పరిస్థితి అంతా అస్తవ్యస్తంగా ఉండి ఆయనకు కొంచెం కంపరం కలిగించింది. తనచుట్టూ వాతావరణం అంతా విషాదభరితంగా ఉన్నట్లు ఆయనకు అనిపించసాగింది. ఆయనకు చాలా కోపం వచ్చింది. అసలే ఆయన్ది మంకీఫేసు అది కాస్తా ఎర్రబడిపోయింది.

తోకమాత్రం తక్కువగా, నిప్పుతొక్కిన కోతిలా ఉన్న ఆయన పరిస్థితిని చూసిన ఆఫీసు ప్యూను ఎందుకయినా మంచిదని ఆయన చేతికి అందనంత దూరంగా పోయి నిలబడ్డాడు.

○ ○ ○

ఇంటర్వ్యూ మొదలయింది.

అభ్యర్థి మాసిపోయి, చిరిగిన దుస్తులు ధరించి లోపలికి విషాదంగా ప్రవేశించాడు.



అతడి గడ్డం బాగా పెరిగి ఉంది. కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకున్నట్లుగా ఉన్నాడు. ఈ ఉద్యోగం రాకపోతే సరి సరి పోయినయ్యో, గొయ్యో చూసుకునేలా కూడా ఉన్నాడు.

జనరల్ మేనేజరుగారు 'రివాల్వింగ్' కుర్చీలో మతిపోయినట్లుగా కూర్చున్నారు. అభ్యర్థిని ఏం అడగాలో ఆయనకు అర్థం కావటేదు. కాసేపు బట్టతల గోక్కున్నారు. ఇంకాసేపు భూతద్దాల కళ్ళజోడు తుడుచుకున్నారు. కొంచెం సేపు పైకప్పును నిశితంగా పరీక్ష చేశారు. తరువాత ముక్కు గోక్కున్నారు. ఆతరువాత ఏం చెయ్యాలో తోచక మళ్ళీ అభ్యర్థికేసి చూశారు. ఆయనకు కొంచెం భయం వేసింది. ఉద్యోగం ఇవ్వకుంటే తనమీద పడి రక్కేసి, కరిచేస్తాడేమోనని ఇసుమంత కలవరపడ్డారు.

చివరకు ఆయనకు మెరుపులాంటి ఆలోచన వచ్చింది. వెంటనే దాన్ని అచరణలో పెట్టారు.

"నేను మూడంటే మూడే ప్రశ్నలు అడుగుతాను. సమాధానాలు చెప్పగలిగితే ఉద్యోగం నీకు ఖాయం" అన్నారు.

పాపం. ఆ నిరుద్యోగి నవ్వుమొహం వేసుకుని తలూపాడు.

ఆయన చెప్పడం మొదలుపెట్టారు.

"ఇది నా మొదటి ప్రశ్న : నేను కారులో వస్తూ ఉండగా గేటుదగ్గర చిరిగిన గుడ్డల పీలికలతో ఒకడు కనిపించాడు. వాడు ఆ చిరిగిన గుడ్డలను అందరికీ చూపిస్తున్నాడు. ఎవడు వాడు?

రెండవ ప్రశ్న : నేను లోపలికి వస్తూండగా గోడవాటున ఒకడు తను తొడుక్కున్న చొక్కాను చింపేసుకుంటున్నాడు. ఎందుకలా చేస్తున్నాడు?

ఇక మూడవ ప్రశ్న : నా ప్రయివేటు రూమ్‌వైపుకు వెళ్తూండగా ఓ మూల తెల్లటి బట్టలు వేసుకున్న ఓ యువకుడు హఠాత్తుగా పిచ్చిపట్టినవాడిలా క్రిందపడి మట్టిలో పొర్లాడాడు. కారణం?"

అభ్యర్థి కిక్కురుమనలేదు. తేలుకుట్టిన దొంగలా అయిపోయాడు. సమాధానాలు తెలిసుండీ చెప్పలేక అతడు చాలా తికమక పడ్డాడు.

"నెక్స్ట్!"

తేలుకట్టిన దొంగలు చాలామందే ఉన్నారు. అందరి ముఖాలు విషాదంగా కన్పిస్తున్నాయి.

జనరల్ మేనేజరుగారికి నిజంగా పిచ్చెత్తేలా ఉంది. బుర్ర ఊరేక్క గోక్కోవడం మొదలుపెట్టారు. శివమెత్తిపోతోంది. పైల్సు కంప్లయింటు ఉన్నవాడిలా ఉగ్రుడయిపోవడం మొదలుపెట్టారు. ఎవరికీ ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలియవా? ఏమిటీ విచిత్రం! ఈ ప్రశ్నలకు సమాధానాలు వినకోవడానికి అడవులకు పోయి బ్రహ్మగురించి తపస్సు చెయ్యాలా? అడవులెక్కడ ఉన్నాయి ....ఆయన మనస్సు పరిపరివిధాల పోయింది.

చట్టచివరికి ఓ అభ్యర్థి లోపలకు ప్రవేశించాడు

అతను వేసుకున్న బట్టలు ఖరీదయినవి కాకపోయినా శుభ్రంగా ఉన్నాయి. అతను గదిలోకి ప్రవేశిస్తుంటే వెన్నెల ప్రవేశించినట్లుగా ఉంది. అతడు ప్రశాంతంగా ఉన్నాడు. తన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి స్వయంగా బ్రహ్మదేవుడే దిగివచ్చినట్లుగా అనిపించింది జనరల్ మేనేజరుగారికి. ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవడానికి ఆ అభ్యర్థి ముందు మోకరిల్లి వినమ్రుడై, భక్తితో చేతులు జోడించాలని జనరల్ మేనేజరుగారికి ఓ క్షణం అనిపించిన మాట వాస్తవం. పాపం ఆయన తన్ను తాను సంబాళించుకోవలసి వచ్చింది.

ప్రశ్నలు అభ్యర్థి ముందు ఉంచబడ్డాయి

ఆ అభ్యర్థి సహ్యాంతర్యామిలా చిరునవ్వు నవ్వాడు. గంభీరంగా తల పంకించాడు.

కొంచెం సేపు మౌనం వహించాడు.

అతడు ప్రారంభించాడు.

"ఈ దేశంలో ఏ పనిసే ఉద్యోగాలు దొరకుతాయో తెలియని కొందరు అమాయకులు అవలంబిస్తున్న పద్ధతులు సార్ ఇవి. చదువుకు విలువలేదు. ఇతర అర్హతలకు విలువ లేదు. రికమెండేషను, డబ్బు ఇవి సార్....ఇవి కావాలి. ఈ రెండూ ఉన్నవాళ్ళకే ఉద్యోగాలు. ఈ రెండులో కూడా డబ్బుకున్న విలువ రికమండేషనకు లేదు. అయినా వీళ్ళకెవ్వరు రికమెండ్ చేస్తారు? పోతే డబ్బు. డబ్బే ఉంటే ఇన్నాళ్ళు ఉద్యోగం కోసం ఎదురుచూసేవాళ్ళెందుకు ఏదైనా వ్యాపారం చేసుకుందురు కష్టపడి చదివి డిగ్రీలయితే సంపాదించుకోగలిగారు ఈ అమాయకులు. వీళ్ళల్లో 'ఐన్‌స్టీన్' అంతటి గొప్పవాళ్ళు కాగలిగినవాళ్ళున్నారు. అయితే నేం— ఉద్యోగాలు సంపాదించడం మాత్రం వీళ్ళకు తెలియడం లేదు ఫూల్స్ సార్.... ఈ దేశంలో బ్రతకడానికి చదువులెంతవరకూ పనికొస్తాయో తెల్సుకోలేని 'ఎడ్యుకేటెడ్ ఫూల్స్' సార్ వీళ్ళు....

సరియైన మార్గంలో వెళితే ప్రయోజనం లేకపోవడం వలన ఏ మార్గంలోనైనా సరే ఉద్యోగాలు సంపాదించాలనే నిర్ణయానికి వచ్చేశారు సార్ వీళ్లు. ఈ ప్రభుత్వమూ, సమాజమూ వీళ్ళను బహూస్లుగాకూడా తీర్చిదిద్దింది సార్.

మీరు చాలా మంచివారని, పేదవాళ్ళంటే మీకు చాలా సానుభూతి అని, వాళ్ళకే ఎక్కువగా ఉద్యోగాలు ఇస్తుంటారని బయట ఒక మాట పొక్కింది సార్. ఈ వార్త తెలిసిన ఒక చిన్న వ్యాపారస్తుడు చిరిగిన గడ్డల మూటలు తెచ్చి జత రెండు రూపాయలకు అద్దెకు ఇవ్వడం ప్రారంభించాడు సార్. వాణ్ణే మీరు గేటుదగ్గర చూశారు. ఇక చొక్కా



కవితకి కార్టూన్ :



జమీందారు రోల్సుగారు — మాటంటావా, స్వామి
మహారాజు మనీపర్సు — ఏమంటావు?

చింపుకున్న యువకుడు—అతడు కావాలనే మీకు బీదవాడిలా కనబడాలని చొక్కా చింపుకున్నాడు. మూడవ అతని గురించి చెప్పక్కర్లేదనుకుంటాను. అతడూ పై కారణంగానే శ్రీదపడి మట్టిలో పడి దొర్లాడు...."

అతడు చెప్పడం పూర్తి చేశాడు.

పైన సీలింగుఫాను రొద చేసుకుంటూ తిరుగుతున్న చప్పుడు తప్పించి కొన్నిక్షణాలు భయంకరమైన నిశ్శబ్దం రాజ్యం చేసింది.

శరీరం ముచ్చెమటలు పోయగా హీనస్వరంతో జనరల్ మేనేజరుగారు చివరిప్రశ్నగా అడిగారు :

"మరి నువ్వెందుకు చిరిగిన బట్టలు వేసుకోలేదు?"

అర్థం కానట్టు నవ్వాడు. అతడి మోము వింతగా మనోహరంగా భాసించింది.

అతనన్నాడు—

"ఆ రెండు రూపాయలుంటే నేను రెండు పూటలు పొట్ట నింపుకోగలను సార్!" ❊